క్లుప్తంగా

శాకాంబరీ అలంకరణలో కన్యకాపరమేశ్వరి



కూరగాయలతో అలంకరించిన కన్యకాపరమేశ్వరీ మాత

ఆస్పరి: స్థానిక వాసవీ మాత ఆయలంలో కన్యకాపరమేశ్వరి శుక్రవారం శాకాంబరీ అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి కూరగాయలు, ఆకు కూరలు, వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

గాయత్రీ మాత ఆలయంలో..

ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకుడు రూపామోహన్‌స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి గంగ, ఆకుపూజ, కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు జరిపించారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం



ఎద్దులదొడ్డిలో గర్భకోశ పరీక్షలు చేస్తున్న అధికారులు

తుగ్గలి : రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఎద్దులదొడ్డిలో శుక్రవారం పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు పెయ్యదూడలు జన్మించేలా ప్రత్యేక ఇంజక్షన్ వేశారు. వైద్య శిబిరంలో 110 ఆవులు, గేదెలకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి చికిత్స చేశారు. పాడి పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అసిస్టెంట్ డైరెక్టర్ రవి ప్రకాష్‌రెడ్డి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్, తుగ్గలి, హోసూరు, ముక్కెల్ల, జొన్నగిరి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు ప్రణీత, లక్ష్మీ, వెంకటేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

నిట్రవట్టిలో ముగిసిన మొహర్రం



పీర్లను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

హాలహర్వి: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం మొహర్రం ముగియగా నిట్రవట్టి గ్రామంలో శుక్రవారం ముగిశాయి. ఉదయం నుంచి పీర్లకు ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం పీర్లను ఏటికి తరలించారు. ఈ సందర్భంగా జరిగిన ఊరేగింపులో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, హాలహర్వి ఎస్ఐ నరేంద్ర, చిప్పగిరి ఎస్ఐ రిజ్వాన్‌బాషా బందోబస్తు నిర్వహించారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

దేవనకొండ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో మే 28న నైట్ డ్యూటీ విధులు ముగించుకుని ఇంటికెళ్లిన హోంగార్డు శ్రీనివాసులు గుండెపోటుకు గురై మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి అండగా నిలవాలని పోలీసు, హోంగార్డు సిబ్బంది తమవంతుగా రూ.1,26,000 సేకరించారు. ఈ మొత్తాన్ని పత్తికొండ డీఎస్పీ కె.శ్రీనివాసులు చేతుల మీదుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందించారు. సాయం అందించిన పోలీసు సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మేఘమా.. వర్షించుమా!



నంచర్లలో కమ్ముకున్న మేఘాలు

చిప్పగిరి : ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సుమారు 7వేల హెక్టార్లలో పంటలు సాగు చేయాల్సి ఉంది. అయితే అరకొర వర్షాలకు ఇప్పటి వరకు కేవలం 55 హెక్టార్లలో మాత్రమే కంది, వేరుశనగ, పత్తి తదితర పంటలు సాగయ్యాయి. విత్తు వేసినప్పటి నుంచి వరుణుడు ముఖం చాటేయడంతో వేసిన పంటలు ఎదుగుదల లేక వాడుముఖం పట్టాయి. వారం నుంచి రోజూ మేఘావృతమవుతున్నా.. చినుకు రాలడం లేదు. అప్పుడప్పుడు తేలికపాటి జల్లులు మాత్రమే కురుస్తున్నాయి. వాన దేవుడు కరుణిస్తాడేమోనని అన్నదాతలు రోజూ ఆకాశం వంక చూస్తూ.. మేఘాలు తరలిపోవడాన్ని చూసి నిట్టూరుస్తున్నారు.

స్వచ్ఛత కొరవడి.. రోగాలు వెంటబడి!

- నాలుగు రోజుల నుంచి ఆలూరు మండలంలోని కురువళ్లి గ్రామంలో కలుషిత నీటి వల్ల వాంతులు, విరేచనాలు ప్రబలడంతో దాదాపు 20 మంది ఆలూరుతో పాటు హాలహర్వి, ఇతర ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరారు.
- జూన్ 16,17 తేదీల్లో హొళగుంద మండలంలోని నెరణికి తండాలో తాగునీరు కలుషితమై అతిసార ప్రబలి దాదాపు 50 మంది అస్వస్థతకు గురవగా, చంద్రికాబాయి అనే వృద్ధురాలు మృతి చెందింది. 18న గ్రామంలో ప్రభుత్వ వైద్యులు వైద్యశిబిరం ఏర్పాటు చేయగా డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రవీణ్ కుమార్ గ్రామానికి చేరుకొని శిబిరాన్ని పర్యవేక్షించి, గ్రామాన్ని పరిశీలించారు.
- ఇటీవల ఆలూరు మండలం మరకట్టులో వాంతులు, విరేచనాలతో దాదాపు 15 మంది ఇబ్బందులు పడగా, వైద్యులు వెంటనే స్పందించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.
- నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలోని గ్రామాల నుంచి రోజుకు ఒకరు నుంచి ముగ్గురు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు.

ఇలా రోజూ కొందరు అస్వస్థతకు గురవుతున్నా వెలుగులోకి రావడం లేదు. కేవలం పరిస్థితి అదుపుతప్పిన గ్రామాల వివరాలు మాత్రమే వెల్లడవుతున్నాయి. కలుషిత నీరే ఇందుకు కారణమని వైద్యులు పేర్కొంటున్నారు.

- రంగుమారిన నీరు సరఫరా
- డైరెక్ట్ పంపింగ్‌తో కలుషితమవుతున్న జలం
- నీటి నాణ్యత పరీక్షలు గాలికొదిలేసిన అధికారులు
- రోగాలబారిన జనం



హాలహర్వి మండలం బాపురం రిజర్వాయర్ వద్ద డైరెక్ట్ పంపింగ్ దృశ్యం



ఆలూరులో సరఫరా అవుతున్న రంగుమారిన నీరు

ఆలూరు రూరల్: చివరకు స్వచ్ఛమైన నీరు కూడా ప్రజలకు అందడం లేదు. ఇంటింటికీ సరఫరా చేసే నీరు శుభ్రంగా ఉందా, క్లోరినేషన్ చేస్తున్నారా లేదా, ఫిల్టర్ చేస్తున్నారా లేదా అని పట్టించుకునే వారు కరువయ్యారు. ఆలూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో రోజుకు కొందరు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ఈ ప్రక్రియ నిత్యకృత్యంగా మారడంతో అధికారులు స్పందించడం లేదు. రిజర్వాయర్ల నుంచి నీటిని శుద్ధి చేయకుండా డైరెక్టర్‌గా ట్యాంకులకు సరఫరా చేస్తుండడంతో రంగుమారిన నీరు వస్తోంది. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లోని తాగునీటి సరఫరా స్కీముల పైపులైన్లు దెబ్బతినడంతో అపరిశుభ్రమైన నీరు సరఫరా అవుతోంది. గ్రామాల్లో అధిక శాతం ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయడం లేదు. వర్షాకాలంలో ప్రతి నెలా పంచాయతీ పరిధిలో నీటిని నాణ్యత పరీక్షలు చేయించాలి. అయితే ఆలూరులో మాత్రం అధికారులు నీటి నాణ్యత పరీక్షలను గాలికి వదిలేశారు.

నీటి నాణ్యత పరీక్షలు ఏవీ?

మండలాల్లో ఆర్‌డబ్ల్యూస్ ఆధ్వర్యంలో నీటి నాణ్యత పరీక్షలు చేయాల్సి ఉంది. ఆయా గ్రామాల్లో తాగు నీటి సరఫరా ట్యాంకుల నుంచి నీటిని సేకరించి ఎప్పటికప్పుడు నాణ్యత పరీక్షలు చేసి నీటి కలుషితంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవాల్సి ఉంటుంది. అలాగే ప్రతి గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ వద్ద నీటి పరీక్షల అత్యవసర కిట్టు కూడా అందుబాటులో ఉంటుంది. వీరు విధిగా గ్రామాల్లో తాగునీటి పరీక్షలు చేయాలి. పరీక్షలు, శుద్ధజలంపై గ్రామాల్లో అవగాహన సైతం నిర్వహించాలి. వీరు స్కీమ్ బోర్లలోని నీటిలో నైట్రేట్, ఫ్లోరైడ్, డీసాల్ట్ సాలిడ్స్, క్షార జలసాంద్రత నిర్వహించాలి. దీంతో పాటు రక్షిత మంచి నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి. కానీ ఇక్కడ ఇవ్వన్నీ జరగడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా జనం రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారనే విమర్శలున్నాయి.

పంప్‌హౌస్ నుంచే డైరెక్ట్ సరఫరా..

ప్రజలకు శుద్ధమైన జలాన్ని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులకు నిబంధనలు ఉన్నాయి. తుంగభద్ర డ్యాం నుంచి ఎల్‌ఎల్‌సీకి విడుదలయ్యే నీటిని హాలహర్వి మండలం బాపురం,చింతకుంట, హొళగుంద మండలం విరుపాపురం రిజర్వాయర్లలోకి పంపింగ్ చేస్తారు.అక్కడ ఏర్పాటు చేసిన ఎనిమిది రకాల ఫిల్టర్ బెడ్‌లకు వదిలి తిరిగి ఓహెచ్‌ఆర్, జీహెచ్‌ఆర్‌కు.. అక్కడ గ్యాస్ పెట్టి నీటిని వదలాలని నిబంధనలు చెబుతున్నాయి. ఓహెచ్‌ఆర్ ట్యాంకులకు నీరు చేరిన తర్వాత గ్రామ పంచాయతీ అధికారులు బ్లీచింగ్ పౌడర్ కలిపి నీటిని ఇంటింటికీ సరఫరా చేయాలి. అయితే ఇక్కడ అవేవీ పాటించకుండానే నీటిని డైరెక్ట్‌గా సరఫరా చేస్తున్నారు. శుద్ధి చేయని నీటిని తాగడంతో రోగాలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఆలూరు పరిసర గ్రామాలకు పది రోజులుగా రంగుమారిన నీరు సరఫరా అవుతోంది. ఐదేళ్ల క్రితం బాపురం నుంచి ఆలూరు గ్రామం వరకు రూ.8 కోట్లు ఖర్చు చేసి ప్రత్యేక పైపులైన్ వేసి బూస్టర్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఈ బూస్టర్ పాయింట్ నుంచి దాదాపు మండలంలోని 17 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇలాంటి నీటిని తాగుతున్నందునే రోగాలు ప్రబలుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.





ఆలూరులో నీటి పరీక్షల ల్యాబ్, నెరణికి తండాలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ(ఫైల్)

కలుషిత నీరు తాగితే రోగాలు



కలుషిత నీరు తాగడం వల్లే వాంతులు,విరేచనాలు అవుతాయి. ప్రధానంగా కలరా, ఈకోలై డయేరియా, జియా డయేరియా వ్యాధులు వస్తాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు కలుషిత నీటితో అనారోగ్యానికి గురవుతారు. అలాగే లివర్ సంబంధిత జబ్బులు వచ్చే అవకాశముంది. నీళ్లను కాచి వడబోసి తాగితే మంచిది. వారం నుంచి కలుషిత నీరు తాగి అనారోగ్యానికి గురై ఆసుపత్రికి అధికంగా వస్తున్నారు.

– వాహిద్,డాక్టర్,ఆలూరు

ధ్రువ పత్రాలు అందజేయండి

మద్దికెర : కౌలు రైతులు కౌలు కార్డుతో పాటు మరిన్ని ధ్రువపత్రాలు జతపరచాలని ఏఓ రవి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంబంధిత వీఆర్వో లేదా రైతు సేవా కేంద్రంలో కౌలు కార్డు పొందాలన్నారు. కార్డుతో పాటు పొలం యజమాని ఆధార్ కార్డు, పొలం పాస్‌బుక్ జిరాక్స్, 1బీ జిరాక్స్, కౌలు అగ్రిమెంట్, కౌలు రైతు ఆధార్ కార్డు, కౌలు రైతు ఫొటో జత చేసి వ్యవసాయ అధికారులకు అందజేయాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

22నుంచి శిక్షా సప్తాహ్

తుగ్గలి : జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహించాలని ఎంఈవో–2 రామవెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించాలన్నారు. 23న పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా అమలు చేసేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. 24న విద్యార్థులకు క్రీడా పోటీల నిర్వహణ, 25న సాంస్కృతిక కార్యక్రమాలు, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర కృత్యాలు, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం నిర్వహించాలని చెప్పారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

కృష్ణగిరి: ఆధార్‌కార్డును ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ మండల వ్యాప్తంగా ప్రత్యేక క్యాంపులు ఉంటాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 23న కృష్ణగిరి, ఎరుకలచెర్వు, చిట్యాల గ్రామాల్లో క్యాంపులు ఉంటాయన్నారు. 24న పోతుగల్లు, కృష్ణగిరి, ఆలకొండ గ్రామాల్లో, 25న అమకతాడు, చుంచుఎర్రగుడి, కటారుకొండ, 26న తొగర్చేడు, కంబాలపాడు, లక్కసాగరం, 27న టి. గోకులపాడు, ఎస్‌హెచ్ ఎర్రగుడి, కోయిలకొండ గ్రామాల్లోని సచివాలయాల్లో సిబ్బంది ఆధార్ అప్‌డేట్ చేస్తారన్నారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో 5 -15 సంవత్సరాల్లోపు ఉన్న విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేసుకునేలా ఏంఈఓ అవగాహన కల్పించాలని సూచించారు.

సరుకుల పంపిణీలో తేడాలు వస్తే చర్యలు

- పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి
- సివిల్ సప్లయిస్ గోదాము, ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

ఆలూరు: వినియోగదారులకు నిత్యవసరాల సరుకుల పంపిణీలో అవినీతి, అక్రమాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఉన్న సివిల్ సప్లయిస్ స్టాక్ పాయింట్ గోదాములను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో నిల్వ ఉన్న బియ్యం, కందిబేడలు, చక్కెర స్టాక్, పురుగులు, స్టాక్ పాయింట్ రిజిష్టర్‌ను పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రేషన్ షాపుల డీలర్లకు మంజూరు చేస్తున్న బియ్యం, కందిబేడలు,సుగర్ తదితర సరుకులను సక్రమంగా కాటా వేస్తున్నారా లేదా అని గోదాము ఇన్‌చార్జ్ బల రామిరెడ్డి, హమాలీలను అడిగి తెలుసుకున్నారు.



ఆలూరు స్టాక్ పాయింట్‌లో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ

ఆలూరు స్టాక్ పాయింట్లో ఎక్కవగా తేడాలు వస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ చంద్రశేఖరయ్య, ఆర్ఐ బసన్నగౌడు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఆలూరు రూరల్: సీజనల్ వ్యాధులతో ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి వైద్యులకు సూచించారు. శుక్రవారం ఆమె స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. 30 పడకల వార్డు, ప్రసూతి గది, ఎమర్జెన్సీ మెడికల్ రూములను పరిశీలించి ఆస్పత్రిలో అందుతున్న వైద్యంపై రోగులకు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో ఎక్కువ శాతం సుఖప్రసవాలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆర్ఐ బసవన్న గౌడ్, వైద్యులు వాహిద్,శ్రీకాంత్, రాజశేఖర్ ఉన్నారు.



ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రామలక్ష్మి

సీజనల్ వ్యాధులపై అవగాహన

చిప్పగిరి: సీజనల్ వ్యాధుల వ్యాప్తి, నియంత్రణ చర్యలపై శుక్రవారం మండలంలోని నంచర్ల గ్రామంలో ఈఓపీఆర్డీ బాలన్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, ఓవర్ హెడ్ ట్యాంకు పరిసరాలు, మురుగు కాలువలను పరిశీలించారు. గ్రామంలో మురుగు, వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామస్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మురుగు నీరు బయటకు వదలకుండా ఇంకుడు గుంతలు తీసుకోవాలని సూచించారు. పరిసరాల శుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవన్నారు. పంచాయతీ కార్యదర్శి సురేంద్ర, ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కరివేములలో ఫ్రైడే - డ్రైడే

దేవనకొండ: మండలంలోని కరివేముల గ్రామంలో శుక్రవారం సబ్ యూనిట్ అధికారి సాయిబాబా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో తిరుగుతూ పరిసరాలను పరిశీలించి స్థానికులకు పలు సూచనలు చేశారు. ఎక్కువ కాలం డ్రమ్ముల్లో, తొట్టెల్లో నీటిని నిల్వ ఉంచుకోరాదన్నారు. దోమకాటుకు గురికాకుండా ప్రజలు రాత్రివేళల్లో దోమతెరలు వాడాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌సీఓ రంగస్వామి, సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

వెల్దుర్తి(కృష్ణగిరి): పుట్టపర్తి భగవాన్ సత్య సాయిబాబా వంద సంవత్సరాల జన్మదిన వేడుకల సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు సత్యసాయి భజన మండలి వెల్దుర్తి మండల కన్వీనర్ తిరువీధి సాయిప్రసాద్ తెలిపారు. శుక్రవారం వెల్దుర్తి పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో కర్నూలు మోడరన్ ఐ ఆసుపత్రి డాక్టర్లతో 500 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయించారు. పాఠశాల ఆవరణలో 200 మొక్కలు నాటారు. భజన మండలి అధ్యక్షుడు సాయి కృష్ణారెడ్డి, కిషోర్, ప్రకాష్, సురేష్‌యాదవ్ పట్టాభి, కరుణాకర్‌రెడ్డి, హెచ్‌ఎం నాయక్ పాల్గొన్నారు.

మలేరియా నివారణకు పటిష్ట చర్యలు

ఆలూరు రూరల్: మలేరియా నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మలేరియా అసిస్టెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్, ఏపీ ట్రైబల్ ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లకు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణలో పాత సామాన్లు, వాడి పడేసిన డబ్బాలు, కొబ్బరి చిప్పల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. రాత్రి పూట దోమ తెరలు వాడాలని చెప్పారు. 5 శాతం ఏసీఎం ద్రావణాన్ని నీటిలో కలిపి పాఠశాలల ఆవరణలో పిచికారీ చేయించారు. అనంతరం మొలగవల్లి పీహెచ్‌సీలోని ల్యాబ్‌ను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. మలేరియా నివారణ ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్లు రవి, శేఖర్, ఆదోని యూనిట్ మలేరియా అధికారి మంజునాథ్, ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం ఉన్నారు.



నిల్వ నీటిలో లార్వాను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్ రావు

నాడు- నేడు పనులు పూర్తి చేయాలి

మద్దికెర : ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు చేపట్టిన నాడు–నేడు పనులు పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ అలివేలమ్మకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఆయా పాఠశాలల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, అలాగే ఆదర్శ పాఠశాల ప్రహరీ నిర్మాణం ఆగిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు వంశీ, హరి, శివ పాల్గొన్నారు.

23న చేపల పెంపకానికి వేలం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలోని అటవీశాఖ పరిధిలో ఉన్న వీరగన్నగట్టు చెరువులో చేపల పెంపకానికి మరోమారు ఈ నెల 23వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి ఓబులేసు గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న వేలం నిర్వహించగా ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో మరోమారు నిర్వహిస్తున్నామన్నారు. 2014 జూలై 1నుంచి 2025 జూన్ 30 వరకు ఏడాది హక్కుకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు కర్నూలు రేంజ్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు, గృహ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కృష్ణగిరి, వెల్దుర్తి ట్రాన్స్‌కో ఏఈలు మద్దిలేటి, రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక కార్యాలయాల్లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రెండు మండలాల్లోని రైతులు తమ పొలాల్లోని విద్యుత్ బోర్లలో ఉన్న స్విచ్చులను తడి చేతులతో ముట్టుకోరాదని, ఇంట్లో అతుకుల విద్యుత్ తీగలు ఉంటే వాటిని ఎలక్ట్రీషియన్‌తోనే మార్చుకోవాలన్నారు. రహదారుల వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు, సపోర్టు వైరును ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని సూచించారు. విద్యుత్ తీగ సరీస్ వైరుకు సపోర్టుగా వాడుకునే జీఏ వైరుకు ప్లాస్టిక్ తొడుగు ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లు, స్టార్టర్లకు విధిగా ఎర్తింగ్ పెట్టుకోవాలని, వర్షానికి ఎక్కడైనా తీగలు తెగిపడితే వెంటనే విద్యుత్ అధికారులకు తెలియజేయాలని చెప్పారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి


దేవనకొండ: గ్రామాల్లో ప్రజలు పరిసరాల శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపేట గ్రామంలో ఆరోగ్యం–పరిశుభ్రత అంశంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి నల్లబోతుల సునీత, సర్పంచ్ శేఖమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. స్థానికులు మాట్లాడుతూ.. అదనపు ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, మస్తానతాత ముఖద్వారం వద్ద పారుతున్న నీటిని డ్రెయినేజీ ద్వారా గ్రామం బయటకు పంపేలా చర్యలు చేపట్టాలని, కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రెయినేజీ కాలువల ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా కాలువ పనులను త్వరితగతిన చేపట్టాలని విన్నవించారు. పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వీఆర్ఏ ఆనంద్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ సలాం, సర్వేయర్ షఫీవుల్లా, గ్రామపెద్దలు చాంద్‌బాషా, మద్దిలేటి శ్రీను పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

హొళగుంద: మండల కేంద్రంలో దోమల బెడద నివారణ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, శుద్ధమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం సర్పంచ్ చలువాది రంగమ్మ ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారీ చెయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించి, తాగునీటిని క్లోరినేషన్ చేయించారు.

ప్రత్యేక సమావేశం..

గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆజాద్ పంచాయతీ సెక్రటరీలు, హెల్త్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డెంగీ, మలేరియా, అతిసార, టైఫాయిడ్ వ్యాధుల నివారణపై సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం లోపించడం, దోమల బెడద లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. హొళగుంద, గజ్జహళ్లి పీహెచ్‌సీ డాక్టర్లు న్యూటన్ రాధ, ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్ తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.



హొళగుందలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

‘ఆలూరు ఇన్‌చార్జ్‌గా వీరభద్రగౌడ్ వద్దు’

- జిల్లా టీడీపీ కార్యాలయంలో తెలుగు తమ్ముళ్ల నిరసన
- పార్టీ జిల్లా అధ్యక్షుడితో గంటసేపు వాగ్వాదం

కర్నూలు: ఆలూరు అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జ్‌గా వీరభద్రగౌడ్ వద్దంటూ ఆ పార్టీ జిల్లా కార్యాలయం వద్ద తెలుగు తమ్ముళ్లు నిరసనకు దిగారు. 2019 నుంచి 2024 వరకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా కోట్ల సుజాతమ్మ వ్యవహరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆమె టిక్కెట్ కూడా ఆశించారు. అయితే అనూహ్య పరిణామాల నేపథ్యంలో అధిష్టానం వీరభద్ర గౌడ్‌ను అభ్యర్థిగా ప్రకటించగా ఆయన ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. అనంతరం నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు మూడు గ్రూపులుగా విడిపోయారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు వీరభద్రగౌడ్‌కు కాకుండా చిప్పగిరి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మీనాక్షి నాయుడుకు ఇవ్వాలంటూ శుక్రవారం నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు జిల్లా కేంద్రానికి తరలివచ్చారు. మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో పవన్ గ్యాస్ యజమాని వెంకటేశ్వర చౌదరి, చిప్పగిరి మాజీ సర్పంచ్ రాధమ్మ, ఆలూరు మండల టీడీపీ కన్వీనర్ అశోక్‌యాదవ్, హొళగుంద మండలం చిన్నహ్యాట గ్రామానికి చెందిన శేషగిరి, మరకట్టు గ్రామ సర్పంచ్ యల్లప్ప, హాలహర్వి ఉమాపతినాయుడు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కర్నూలులోని టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. కర్నూలు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డితో సుమారు గంట సేపు వాదనకు దిగారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ వీరభద్రగౌడును నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఒప్పుకునేది లేదని, ఆయన్ను తప్పించి మీనాక్షి నాయుడును నియమించాలని నిరసనకు దిగడంతో జిల్లా అధ్యక్షుడు స్పందించారు. మీ కోరికను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో పార్టీ శ్రేణులు శాంతించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలంటూ వైకుంఠం శివప్రసాద్ కూడా కోరడంతో కొద్దిసేపు కార్యాలయంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. తెలుగు తమ్ముళ్లు ఒకరికొకరు గట్టిగా వాదించుకోవడంతో ఒక దశలో జిల్లా అధ్యక్షుడు అసహనం వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో తెలుగు తమ్ముళ్లు నిరసనను ఉపసంహరించుకుని వెళ్లిపోయారు.



టీడీపీ జిల్లా కార్యాలయానికి తరలివస్తున్న ఆలూరు నియోజకవర్గ శ్రేణులు

క్రీడల్లోనూ రాణించాలి

ఆలూరు: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవ రావు అన్నారు. స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలోనున్న ఏపీ మోడల్ స్కూల్‌లో క్రీడలు, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శుక్రవారం అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఈరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.